క్లుప్తంగా

రెండు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్: రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మండల పరిధి పర్సాపూర్ గ్రామంలో వీధి విద్యుత్ దీపాల మరమ్మతు కారణంగా 27, 28 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. పర్సాపూర్ ఫీడర్ పరిధి గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బడ్జెట్‌లో ప్రాధాన్యంపై బ్రాహ్మణుల హర్షం

కొడంగల్ రూరల్: బ్రాహ్మణ సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత చూపడం పట్ల ఆ సంఘం సభ్యులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 14న ముఖ్యమంత్రికి బ్రాహ్మణ సంక్షేమం కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశామని గుర్తుచేశారు. మా విన్నపాన్ని ఆలకించి రూ.50 కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

మెదడువాపు వ్యాధి నివారణకు 'జేఈ'



విద్యార్థినులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: మెదడువాపు నివారణకు జేఈ వ్యాక్సిన్ తప్పనిసరని మండల వైద్యురాలు మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు వ్యాక్సిన్ సూదిమందు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పిల్లల్లో మెదడువాపు వ్యాధిని నివారించడంతో పాటు భవిష్యత్తులో వ్యాధి వారి దరిచేరకుండా వ్యాక్సిన్ తోడ్పాటునిస్తుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి దేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా తప్పనిసరి

యాలాల: కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి యాదగిరి అన్నారు. శుక్రవారం మండల పరిధి ముకుందాపూర్, జక్కేపల్లి గ్రామాల్లో బీమా గురించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15, 2023 నుంచి జూన్ 28, 2024 వరకు పట్టా పుస్తకాలు పొందిన 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు వ్యక్తులు ఏఓల వద్ద బీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టా పాసుపుస్తకం, ఆధార్, నామిని ఆధార్ జిరాక్స్‌లతో ఏఈఓలను సంప్రదించాలన్నారు. బీమా రెన్యువల్‌లో భాగంగా నామిని మార్పులు లేదా ఇతర మార్పులకు అవకాశం ఉందన్నారు. మార్పు చేర్పులకు చివరి తేది నెలాఖరు అని ఆయన తెలిపారు.

రోడ్డు మధ్యలో కల్వర్టు పనులు

వాహనాల రాకపోకలకు అంతరాయం



కొనసాగుతున్న పైపులైను పనులు

యాలాల: మండల పరిధి బాగాయిపల్లి సమీపంలో రోడ్డు మధ్యలో కల్వర్టు పనులు చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. బాగాయిపల్లి నుంచి తాండూరుకు వచ్చే మార్గంలో ఇరుకుగా ఉన్న ప్రదేశంలో భారీ పైపులతో శుక్రవారం మధ్యాహ్నం హిటాచి, క్రేన్ సహాయంతో పనులు చేపట్టారు. దీంతో ఈ మార్గంలో రవాణా సౌకర్యానికి అరగంట పాటు అంతరాయం కలిగింది.

తహసీల్ కార్యాలయం ఖాళీ!

- డీటీ, ఇద్దరు ఆర్ఐలు, అటెండర్లు బదిలీ
- ఉన్నవారిపై పెరిగిన పని ఒత్తిడి

బషీరాబాద్: సాధారణ బదిలీల్లో భాగంగా అధికారులు వెళ్లిపోవడంతో తహసీల్ కార్యాలయం ఖాళీ అయింది! ఇక్కడ పనిచేస్తున్న డీటీ వెంకటేశ్, ఆర్ఐలు రాకేష్, శివాణి, ఇద్దరు అటెండర్లు ఇతర మండలాలకు వెళ్లారు. వారి స్థానంలో ఎవరూ రాకపోవడంతో.. ఉన్న నలుగురుపై పని ఒత్తిడి పెరిగింది. తహసీల్దార్ వై.వెంకటేశ్ నాలుగు పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా కొనసాగుతూనే.. భూముల రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ సమస్యల పరిష్కారం, సర్టిఫికెట్ల జారీ పనులు చేస్తూ బిజీగా ఉంటున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలకు సకాలంలో పనులు జరగక.. వెనుదిరుగుతున్నారు. కలెక్టర్ స్పందించి ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో పంచాయతీ భవనం



నెర్రలు వారిన భవనం గోడలు

దినదిన గండం..

ఇముడాపూర్ జీపీ భవనానికి ఎక్కడ చూసినా పగుళ్లే

- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

కొడంగల్: అది గ్రామ సచివాలయం. కూలడానికి సిద్ధంగా ఉంది. అయినా సిబ్బంది అందులోనే బిక్కుబిక్కుమంటూ పరిపాలన కొనసాగిస్తున్నారు. ఎప్పుడు కూలి, ఎవరి ప్రాణాలకు ముప్పు తెస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. దౌల్తాబాద్ మండలం ఇముడాపూర్ గ్రామ పంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. గోడలు నెర్రలు వారాయి. సిమెంటు రాలిపోయి.. ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. అప్పుడప్పుడు పై కప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం వస్తే జల్లెడెలా కురుస్తుంది. అయినప్పటికీ.. విధిలేక శిథిల భవనంలోనే పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ ఏఈఓ, సిబ్బంది తమ విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా ఈ భవనమే వేదిక కానుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వేదికను సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, స్పందించి కొత్త భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సిబ్బంది, గ్రామస్తులు కోరుతున్నారు.

శాకంబరి మాతగా రేణుకా ఎల్లమ్మ



తాండూరు టౌన్: వాల్మీకినగర్ శ్రీరేణుకా ఎల్లమ్మ శాకంబరి మాతగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని తీరొక్క కూరగాయలతో అలంకరించారు. మహిళా భక్తులు పారాయణం చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పూజలు చేశారు. కార్యక్రమంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్, కార్యదర్శి పూజారి పాండు, నగేష్, సంగ్రాం, నాగరాజు, సునీల్, శరణు, సతీష్, ఆలయ కమిటీ మహిళా మండలి అధ్యక్షులు చంద్రకళ, స్వరూప, జ్యోతి, మహేశ్వరి, లలిత, వాసవి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి కిషన్



గ్రామసభలో మాట్లాడుతున్న కిషన్

పెద్దేముల్: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్, ఇందూరు పంచాయతీ ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. శుక్రవారం మండల పరిధి ఇందూరులో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వానాకాలం, అందులో సీజన్ కాలం అని, వ్యాధులు ముసిరే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమయంలో కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా.. వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదని కిషన్ స్పష్టం చేశారు. విద్యుత్ అధికారుల అనుమతితో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మురుగు కాల్వలు సాఫీగా సాగడం లేదని ప్రజలు సభ దృష్టికి తేగా.. సమస్యను పరిష్కరిస్తామని ప్రత్యేక అధికారి హామీ ఇచ్చారు. పంచాయతీ కార్మికులకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి బలరాం, మాజీ సర్పంచ్‌లు ఇందూరు ప్రకాశం, మొగులప్ప, తట్టెపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరేందర్, గ్రామ పెద్దలు బంధ్యప్ప, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం సమావేశాన్ని జయప్రదం చేయండి

కొడంగల్ రూరల్: పట్టణంలోని రెడ్డిబసిరెడ్డి ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్న ఎంఐఎం సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ కోరారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్న సమీక్షకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పాఠశాల వరండాలో అంగన్‌వాడీ కేంద్రం

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'పెచ్చులూడిన అంగన్‌వాడి పైకప్పు' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా వెల్ఫేర్ ఇన్‌చార్జి ఎ.వెంకటేశ్వరమ్మ స్పందించారు. అసువుపల్లి గ్రామం.. అంగన్‌వాడీ కేంద్రం శిథిలభవనంలో చిన్నారులను కూర్చోపెట్టొద్దని టీచర్‌ను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. అద్దె భవనాలు దొరకడం లేదని, ప్రత్యామ్నాయంగా పక్కనే ఉన్న పాఠశాల వరండాలో పిల్లలకు విద్యాబోధన చేయాలని టీచర్‌కు సూచించినట్లు ఆమె వెల్లడించారు. కొత్త భవనం గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆమె తెలిపారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అనంతగిరి: ప్రభుత్వం నాయీబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, పాలకవర్గాన్ని నియమించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి బ్రాహ్మణుడికి రూ.4వేల పింఛన్, ప్రతి కుటుంబానికి రూ.5లక్షలను పూర్తి సబ్సిడీగా ఇవ్వాలన్నారు.

పేదింటి ఆడ బిడ్డలకు వరం



లబ్ధిదారులతో కడా ప్రత్యేక అధికారి తదితరులు

కొడంగల్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పేదింటి ఆడ బిడ్డలకు వరమని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించిందని తెలిపారు. ఒకేసారి మండల పరిధి గ్రామాలకు చెందిన 105 మంది లబ్ధిదారులకు రూ.1,01,88,064 విలువ కలిగిన చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అర్హులందరికీ చెక్కులు అందడంతో వారు సంతోషం వ్యక్తంచేశారని వెల్లడించారు. ఇందులో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ముస్తాక్, అరిగె ఓం ప్రకాశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ఎంపీడీఓ రామకృష్ణ



నిల్వ నీటిని పారబోయిస్తున్న ఎంపీడీఓ

కుల్కచర్ల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మండల పరిధి అంతారం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇదే విషయమై అధికారులు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మురుగు కాల్వల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి ఎల్లమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి పాల్గొన్నారు.

బోనం.. వైభోగం

- ఊరూరా బోనాల ఉత్సవాలు
- పరవశించిన భక్తజనం



పరిగి: కల్లాపూర్‌లో బోనం ఎత్తుకున్న చిన్నారి



దుద్యాల్: బోనాలతో వస్తున్న మహిళలు


పరిగి/కుల్కచర్ల/దుద్యాల్: ఆషాఢ మాసం సందర్భంగా బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం పరిగి మండల పరిధి సయ్యద్ మల్కాపూర్‌లో మైసమ్మ, పోచమ్మకు.. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో అంతారం, చాపలగూడెం, ముజాహిద్‌పూర్, తిర్మలాపూర్‌లో పోచమ్మకు, దుద్యాల్ మండల హస్నాబాద్‌లో మైసమ్మ బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నెత్తిన బోనంతో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా అమ్మవారి చెంతకు చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

మండల ప్రత్యేక అధికారి వీరభద్రరావు

బషీరాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అందులో భాగంగా పారిశుద్ధ్యం మెరుగు పరచాలని మండల ప్రత్యేక అధికారి వీరభద్రరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ యాదయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో శానిటేషన్ చేయాలని, రోడ్ల మీద మురుగు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి పైప్‌లైన్లు లీకేజీలు లేకుండా చూడాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని చెప్పారు. మురుగు గుంటల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని తెలిపారు. వర్షాలు బాగా పడుతున్నందున ప్లాంటేషన్‌పై దృష్టి సారించాలని, ఉపాధిహామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. పశువులు, పౌల్ట్రీఫామ్ షెడ్ల నిర్మాణానికి అర్హత గల రైతుల జాబితా తయారు చేయాలని ఈజీఎస్ అధికారులకు, కార్యదర్శులకు సూచించారు. షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించాలని, సభలను ప్రత్యేక అధికారుల అధ్యక్షతన జరపాలని స్పష్టంచేశారు. ఇందులో ఈజీఎస్ ఏపీఓ శారద, టీఏ నర్సింహ్మారెడ్డి, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

జవాన్ల త్యాగం మరువలేనిది



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

పరిగి: దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదులుకున్న వీరుల త్యాగం మరువలేనిదని ప్రైవేట్ కళాశాల చైర్మన్ కొప్పుల అనిల్‌రెడ్డి అన్నారు. కార్గిల్ విజయ్‌దివాస్ సందర్భంగా శుక్రవారం కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడారు. దేశ రక్షణ జవానుల చేతుల్లో ఉందని, మనం వారి సేవలను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. దేశం ప్రజలు సురక్షితంగా ఉన్నారంటే.. అది కేవలం సరిహద్దులో పహారా కాస్తున్న జవానుల పుణ్యమేనని స్పష్టంచేశారు. ఇందులో వైస్ చైర్మన్ దీప్తిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ తేజేశ్వర్, ఎన్‌సీసీ ఆఫీసర్ బస్వరాజ్ పాల్గొన్నారు.

అప్రమత్తతే సైబర్ నేరాలకు అడ్డుకట్ట



పెద్దేముల్: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెద్దేముల్: అప్రమత్తంగా వ్యవహరిస్తే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చునని ఏఎస్ఐ బక్కన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రం పోస్టాఫీస్ వద్ద ఎస్ఐ ఆదేశాల మేరకు ఏఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు సంతోష్‌కుమార్, మరళీ, భీమ్‌రెడ్డిలు పోలీస్ చట్టాలు, వాట్సప్ లింకులు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చిన్నారులకు వాహనాలు ఇవ్వరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. బండి పత్రాలు దగ్గరే ఉంచుకోవాలన్నారు. అనవసరమైన లింకులు ఓపెన్ చేయరాదని తెలిపారు. ఏపీకే పేరిట ఉన్న లింకును తెరిస్తే.. మొబైల్ బ్యాంకు ఖాతా, వాట్సప్ గ్రూపులు సైబర్ మోసగాళ్ల చేతుల్లోకి వెళ్తాయని, అలాంటి లింకులు ఓపెన్ చేయరాదన్నారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

జాగ్రత్తగా ఉండాలి

పరిగి: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సూచించారు. పట్టణ కేంద్రంలోని నంబర్ 1 ఉన్నత పాఠశాలలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, డెల్ టెక్నాలజీ సహకారంతో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు డిజిటల్ ప్రపంచంలో ఎలా సురక్షితంగా ఉండాలో.. ఆన్‌లైన్‌లో మోసాల పట్ల ఎలా జాగ్రత్తగా ఉండాలో సూచించారు. విద్యార్థులు.. వారి తల్లిదండ్రులకు ఆన్‌లైన్ మోసాలపై ఎలా అవగాహన కల్పించాలో వివరించారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు మోసాలకు గురికాకుండా ముందుగానే వారి పిల్లలకు అవగాహన కల్పిస్తున్నామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• పరిశుభ్రం ముఖ్యం



తాండూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ అన్నారు. డ్రై డే సందర్భంగా శుక్రవారం ఆమె పట్టణంలోని వార్డు నంబర్ 22 మల్‌రెడ్డిపల్లిలో పర్యటించారు. ఇంటి వద్దకు వచ్చిన చెత్త ట్రాక్టర్లలో చెత్త వేయాలని స్థానికులకు సూచించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణ, నాయకులు జుబేల్‌లాల ఉన్నారు.

• విద్యారంగానికి అన్యాయం

అనంతగిరి: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి సరైన నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ ఆరోపించారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలంటే అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందులో జిల్లా నాయకులు సతీష్, తేజ, కార్తీక్, రహమాన్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

• పాఠాలు చెప్పిన ప్రత్యేక అధికారి

బొంరాస్‌పేట: యువతకు క్రీడా మెళకువలు నేర్పే జిల్లా అధికారి.. బడిలో చిన్నారులకు పాఠాలు చెప్పారు. ప్రత్యేక అధికారిగా జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి హనుమంతరావు.. శుక్రవారం మండల పరిధి భోజన్నగడ్డతండా ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకునేందుకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా హెచ్ఎం విజయలక్ష్మిని ఆయన అభినందించారు.

• బండమీదితండా కార్యదర్శిగా దేవ్‌సింగ్

కుల్కచర్ల: మండల పరిధి బండమీదితండా పంచాయతీ కార్యదర్శిగా దేవ్‌సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

• పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం తగదు

కుల్కచర్ల: చిన్నారులకు, గర్భిణులకు పోషకాహారం పంపిణీలో నిర్లక్ష్యం తగదని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛతను పాటిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న పోషక పదార్థాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేయాలని నిర్వాహకులకు తహసీల్దార్ సూచించారు. ఇందులో జీపీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

• మాజీలకు గౌరవ వేతనం ఇవ్వాలి



కుల్కచర్ల: మాజీ ఎంపీటీసీలు, సర్పంచులకు ఇవ్వాల్సిన గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందిపల్ వెంకట్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సీతక్కను పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డితో మర్యాదపూర్వకంగా ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు.

• స్మితా సబర్వాల్‌పై చర్యలకు డిమాండ్

తాండూరు టౌన్: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని దివ్యాంగులు, తెలంగాణ జన సమితి, న్యాయవాద జేఏసీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేడ్కర్ చౌక్‌లో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. దివ్యాంగుల రిజర్వేషన్‌పై అభ్యంతర కరంగా మాట్లాడిన ఆమెపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వికలాంగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు యాదయ్య, టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్, న్యాయవాద జేఏసీ నాయకులు గోపాల్, షబ్బీర్, చందు తదితరులు ఉన్నారు.

• మురుగును తొలగించాలి

కొడంగల్ రూరల్: మండల పరిధి పర్సాపూర్ గ్రామం బీసీ కాలనీలో సీసీరోడ్డు పక్కన పేరుకుపోయిన మురుగు జలాలను తొలగించాలని గ్రామస్తులు కోరారు. మురుగు నీటితో దోమల బెడద ఎక్కువవుతుందని, చిన్నారులు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి మురుగు జలాలను పారదోలడంతో పాటు.. అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

• కేటాయింపే కాదు.. ఖర్చుచేయాలి

పరిగి: రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్య, వైద్య రంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. పదేళ్ల కాలంలో బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదని, ఇప్పుడైనా మొత్తం ఖర్చు చేయాలని కోరారు.

• రోడ్డు నిర్మాణానికి వినతి



తాండూరు టౌన్: తాండూరు నుంచి వికారాబాద్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాజీవ్ గాంధీ ఫ్రూట్స్ అండ్ వెజ్ వెండర్స్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు సరిగా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ఇందులో సొసైటీ చైర్మన్ మహ్మద్ సమీర్ అహ్మద్, ఉర్దూఘర్ మాజీ చైర్మన్ అబ్దుల్ రజాక్, మహ్మద్ రఫిక్ ఖాన్ ఉన్నారు.